చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

తుక్కాపూర్‌లో చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మే 25: తొగుట మండలం తుక్కాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు చిక్కుడు రాజు, పెద్దమాసాన్ పల్లిలో పన్యాల మధుసూదన్‌రెడ్డి కుమార్తెలు, కుమారులకు ఆదివారం నూతన వస్త్రాలంకరణ చేశారు. ఈ కార్యక్రమాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాతతో కలిసి హాజరై నూతన వస్త్రాలంకరణ చేసిన చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం పెద్దమాసాన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడు కోల కనుకయ్యను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, కొమురయ్య, అరుణ్ కుమార్ ఉన్నారు.

సజావుగా గ్రామపాలన అధికారుల పరీక్ష

సిద్దిపేట, మే 25: గ్రామ పాలన అధికారుల పరీక్ష సజావుగా జరిగినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గ్రామ పాలన అధికారుల పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పరీక్ష గదుల్లో అభ్యర్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వసతులు, సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులు పరీక్ష రాయడానికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సునీతను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 144 మంది అభ్యర్థులకు 14 మంది గైర్హాజరు కాగా 130 మంది పరీక్ష రాశారన్నారు.

సిద్దిపేటలో పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీంమియా ఉన్నారు.

పోటెత్తిన భక్తజనం

హుస్నాబాద్‌టౌన్, మే 25: హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మతల్లిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. హుస్నాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలో గంటల తరబడివేచి చూడాల్సి వచ్చింది. అమ్మవారి దర్శనానికి దాదాపు రెండున్నర గంటలకుపైగా వేచి ఉన్నారు. ప్రత్యేక దర్శనం ద్వారా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు గంటకుపైగా సమయం పట్టింది.

రేణుకాఎల్లమ్మను దర్శించుకునేందుకు సాధారణ క్యూలో వేచి ఉన్న భక్తజనం

నాలా పూడికతీత పనులు ప్రారంభం

నాలా పూడికతీత పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు

సిద్దిపేట, మే 25: లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాలతో సిద్దిపేట కోమటి చెరువు నాలాలో పూడికతీత పనులు చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్సాన్‌పల్లి రోడ్డు వద్ద నాలా పూడికతీత, చెత్త తొలిగింపు పనులను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వైస్ చైర్మన్ కనుకరాజు మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలాలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్తా చెదారం వల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదని పూడిక తొలిగింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎవరికైనా వరద నీటితో ప్రమాదం ఉన్నట్లైతే మున్సిపల్ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వినోద్‌గౌడ్, అరవింద్‌రెడ్డి నాయకులు శ్రీకాంత్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత



రామవరంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి

అక్కన్నపేట, మే 25: ప్రతిఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యం లో చేపట్టిన డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ఆదివారం మండలంలోని రామవరం, సేవాలాల్ తండా, నందారంలో కొనసాగింది. ఆయన మాట్లాడుతూ... మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. ఒకప్పుడు మహానగరాల్లో దొరికే డ్రగ్స్ నేడు మారుమూల పల్లెల్లోకి వ్యాప్తించడం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ బెట్టింగ్స్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, ఏపీఏం శ్రీనివాస్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, ఉప్పుల కుమారస్వామి, అక్కన్నపేట మండల ఇన్‌చార్జి వేముల జగదీశ్, జేఏసీ నాయకులు, మహిళ సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుండారం ప్రభుత్వ పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

బెజ్జంకి, మే 25: మండలంలో గుండారం ప్రభుత్వ పాఠశాలలో 1996-97లో ఏడో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి వారి నుంచి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రహదారి విస్తరణ పనులు

- చినుకుపడితే చాలు.. దుకాణాల్లోకి చేరుతున్న వరద
- అసంపూర్తి పనులు.. ఆర్థికంగా నష్టపోతున్న వ్యాపారులు

హుస్నాబాద్‌లోని దుకాణంలోకి చేరిన వరద

మురుగుకాల్వలోని చెత్తాచెదారాన్ని తొలిగిస్తున్న సిబ్బంది

హుస్నాబాద్‌టౌన్, మే 25: హుస్నాబాద్‌లో జాతీయ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. ఒకవైపు ప్రమాదాలు... మరో వైపు వరద ముంపుతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చాలు హనుమకొండ, సిద్దిపేట రహదారిపై ఉన్న దుకాణాల్లోకి వరద నీరుచేరుతుంది.

ఎక్కడి సమస్యలు అక్కడే..

ఎల్కతుర్తి, రామాయంపేట జాతీయ రహదారి పనులను కాంట్రాక్టర్ వేగవంతంగా చేయడం లేదు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ముఖ్యంగా వరదతో పట్టణ వాసులు, సతమతమవుతున్నారు. దాదాపు పద్దెనిమిది మాసాలుగా జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా చేపట్టిన మురుగు కాల్వల నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో సమస్య జఠిలంగా మారింది. అంబేద్కర్ చౌరస్తా, మల్లెచెట్టుచౌరస్తా, రామవరం బైపాస్ రోడ్డు వద్ద మురుగు కాల్వలు నిర్మించకుండా సదరు కాంట్రాక్టర్ పెండింగ్‌లోనే ఉంచాడు. దీంతో పోతారం(ఎస్) నుంచి వచ్చే వరద బయటకు వెళ్లేందుకు దారిలేక ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల్లోకి చేరుతున్నది. దీంతో విలువైన వస్తువులన్నీ తడిచి వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. తాజాగా గురువారం రాత్రి కురిసిన భారీవర్షంతో వరద ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల్లోకి చేరి పట్టణవాసులు కష్టాలు పడ్డారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

మురుగు కాల్వల నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలివేయడంతో పట్టణవాసులు కష్టాలపాలవుతున్నారు. రహదారి నిర్మాణం జరుగుతున్న క్రమంలోనే వరద బయటకు పంపే కాల్వలు నిర్మించాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వ్యాపారులు వాపోతున్నారు. పట్టణానికి వరద ముంపు లేకుండా చేస్తానని బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గతేడాది ప్రకటించినప్పటికీ నేటికీ ఆ సమస్య పరిష్కారం కాకపోవడంపై పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

జాతీయ రహదారి పనులు సక్రమంగా చేపట్టలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల వర్షం పడి మురుగుకాల్వ నీళ్లు, వర్షం నీళ్లు దుకాణంలోకి వచ్చి సామాన్లు తడిసిపోయాయి. ఇప్పటికైనా మురుగు కాల్వలను శుభ్రం చేయాలి. జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తిచేయాలి.

–వడ్డెపల్లి బాలయ్య, దుకాణాదారుడు, హుస్నాబాద్ టౌన్

రోడ్డుమీదనే ఉన్నాం

రోజూ పండ్లు అమ్ముకునేందుకు మల్లెచెట్టు చౌరస్తాకు వస్తా. గురువారం సాయంత్రం గాలితోపాటు వర్షం వచ్చింది. మురుగుకాల్వలో నీళ్లుపోక రోడ్డు మీదకి వచ్చాయి. మేమంతా గంటసేపు రోడ్డుమీదనే ఉన్నాం.

– కమలమ్మ, చిరువ్యాపారి, హుస్నాబాద్‌టౌన్

భక్తిశ్రద్ధలతో హనుమాన్ యజ్ఞం

హనుమాన్ యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

మద్దూరు(ధూళిమిట్ట), మే25: మద్దూరులోని చిన్మయ తపోవనంలో స్వామి యజ్ఞానంద ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రారంభమైన బాలల వేసవి శిబిరం ఆదివారం ముగిసింది. ఈ శిబిరంలో 8 నుంచి 16ఏండ్లలోపు పిల్లలకు భగవద్గీత, రామాయణం, భాగవతం, భజనలు నేర్పించారు. దీనిలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన పిల్లలకు స్వామి యజ్ఞానంద బహుమతులు అందజేశారు. హనుమాన్ యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి అక్షయ చైతన్య, చిన్మయ మిషన్ అధ్యక్షుడు బుస్సా బాలయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బొడిగం శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు

మద్దూరు(ధూళిమిట్ట), మే 25: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ బొడిగం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మద్దూరులోని హైస్కూల్‌లో కొనసాగుతున్న హ్యాండ్‌బాల్ సమ్మర్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శారీరకదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. మద్దూరు నుంచి జాతీయ స్థాయిలో ఎంతోమంది హ్యాండ్‌బాల్ క్రీడలో రాణించినట్లు గుర్తుచేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్‌ను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ దామెర మల్లేశం, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బోయిని మనోహర్, విశ్రాంత ఉపాధ్యాయుడు మేక బాలసిద్ధయ్య, బోయిని రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సాహిత్యంలో పద్యానిది చెరగని స్థానం

అవధానులను సన్మానించి చేర్యాల కవులు

చేర్యాల, మే 25: సాహిత్యంలో పద్యానిది చెరగని స్థానమని శంకరాభరణం బ్లాగ్ నిర్వాహకుడు అవధాని కంది శంకరయ్య అన్నారు. హైదరాబాద్‌లో జరిగే అవధానికి వెళ్తూ మార్గ మధ్యలో చేర్యాలలో ఆయన మాట్లాడారు. ప్రాచీన కవుల నుంచి నేటి వరకు పద్యం అందరనీ అలరిస్తుందని తెలిపారు. పద్య విద్యలో ఆరితేరి ఎందరో అవధానులుగా అభ్యాసం చేసి వివిధ వేదికలపై అవధానాలు చేస్తున్నారన్నారు. చేర్యాల ప్రాంతం సాహితీ పరంగా ఎంతో వికాసం చెందిందని, కవులు ఎందరో ఈ ప్రాంతంలో ఉన్నారని తెలిపారు. శంకరయ్య అవధానం చేయడం కాక ఎందరినో అవధానుగా తీర్చిదిద్దారని, అందులో తాను ఒకడినని వెంట వచ్చిన అవధాని చేపూర్తి శ్రీరామ్ అన్నారు. ఇరువురు అవధానులను కవి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ, గీతాప్రవచన కర్త తౌట రామాంజనేయులు సన్మానించారు.వారి వెంట కవులు ఎలికట్టె అయిలయ్య, రాజశ్రీ, వుప్పల ప్రభాకర్, మధు, అంజయ్య, మున్నా ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వట్‌పల్లి, మే 25: నేడు మండల పరిధిలోని పల్వట్ల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతుందని వట్‌పల్లి విద్యుత్ ఏఈ ప్రవీణ్ కుమార్ అదివారం తెలిపారు. పల్వట్ల 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్‌పై చెట్టు కొమ్మలు, తీగల తొలిగింపు విద్యుత్ తీగల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు తెలియజేశారు. వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న సాంబరాజు

అక్కన్నపేట, మే 25: మండల కేంద్రంలో విశ్వబ్రహ్మణ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కర్ణకంటి శ్రీశైలం, అధ్యక్షుడిగా కర్ణకంటి రవీందర్, ఉపాధ్యక్షుడిగా కర్ణకంటి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ఆలుగోజు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా విజయభాస్కర్, కోశాధికారిగా కందుకూరి భాస్కరాచారి, కార్యవర్గ సభ్యులుగా కర్ణకంటి మహేందర్, కర్ణకంటి సాంబయ్య, చంద్రమౌళి, అరుణాచారి, ఆలుగోజు ప్రసాద్, కర్ణకంటి బ్రహ్మచారి, ఆలుగోజు బ్రహ్మయ్య, నర్సయ్య, కందుకూరి బుచ్చయ్యను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు అభినందించి సన్మానించారు.

ఇద్దరిని ఢీకొట్టిన కారు ఆచూకీ లభ్యం

ఇద్దరిని ఢీకొట్టిన అనంతరం మర్పడగ వద్ద నిలిచిపోయిన కారు

చేర్యాల, మే 25: సిద్దిపేట, జనగామ జాతీయ రహదారి పక్కన మండలంలోని వీరన్నపేట స్టేజీ సమీపంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టి వేగంగా వెళ్లిన కారు ఆచూకీ లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నుంచి చేర్యాల వైపు వస్తున్న కారు స్టేజీ సమీపంలో ద్విచక్ర వాహనాలు నిలిపి మాట్లాడుకుంటున్న ఇద్దరు వ్యక్తులను వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ క్రమంలో పోలీసులు, గ్రామస్తులు క్షతగాత్రులను దవాఖానలో చేర్పించి ఢీకొట్టి పోయిన కారు ఆచూకీ కోసం యత్నిస్తున్నారు. పట్టణానికి చెందిన శనిగారి భిక్షపతి అనే మెకానిక్ ఢీకొట్టి పారిపోయిన కారు ఫోటోలు కొన్నింటిని తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకుని ఈ రంగు గల కారు కనిపిస్తే తనకు సమాచారం ఇవ్వాలని కోరాడు. దీనిని గమనించిన పలువురు కొండపాక మండలంలోని మర్పడగ పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా కారు ఉందనే విషయాన్ని భిక్షపతికి తెలియజేశారు. ఆదివారం ఉదయం కారును వేములవాడకు తీసుకుపోయినట్లు తెలుసుకున్నారు. కారు నడిపిన వ్యక్తి ద్విచక్ర వాహనాల వద్ద ఉన్న వ్యక్తులను ఢీకొట్టిన అనంతరం కారును పక్కన పెట్టి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టినట్లు సీన్ క్రియేట్ చేసి తిరిగి కారు స్టార్ట్ చేసుకుని చేర్యాల మీదుగా కొండపాక మండలం మర్పడగ వద్దకు వెళ్లిపోగానే కారు ఆగిపోయింది.ఎవరికీ అనుమానం రాకుండా తిరిగి కారును వేములవాడకు తరలించుకుపోయినట్లు తెలిపారు. కారు ఢీకొట్టినవారి వివరాలను క్షతగాత్రుల బంధువులు చేర్యాల పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

కాటేజీ నిర్మాణానికి రూ.15లక్షల విరాళం

కాటేజీ నిర్మాణానికి చెక్కు డీడీ అందజేస్తున్న మహేందర్, రవీందర్

చేర్యాల, మే 25: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో నిర్మాణ పనులు ప్రారంభించనున్న 100 కాటేజీల భవన కాంప్లెక్స్‌కు కొమురవెల్లి మల్లన్న భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఆదివారం మంచిర్యాలకు చెందిన కామారపు మహేందర్, రవీందర్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.15లక్షల విరాళం అందిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం రూ.10లక్షల చెక్కు, రూ.5 లక్షల డీడీని అందించి ఆలయ నుంచి రసీదు పొందారు. ఈ సందర్భంగా ఈవో అన్నపూర్ణ మాట్లాడుతూ భక్తులు, దాతలు కాటేజీల నిర్మాణం కోసం విరాళాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. స్వామివారికి వచ్చే విరాళాలతో భక్తులకు మరిన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.అనంతరం ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు దాతలు మహేందర్, రవీందర్‌కు స్వామివారి దర్శనం కల్పించడంతో పాటు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు, చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ శ్రీరాములు, అర్చకులు పడిగన్నగారి ఆంజనేయులు, పాలక మండలి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లన్న దర్శనం.. భక్తుల పరవశం

మల్లికార్జునస్వామిని దర్శించుకున్న విజిలెన్స్‌అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ అన్నపూర్ణ

చేర్యాల, మే 25: కొమురవెల్లి మల్లికార్జున క్షేత్రానికి ఆదివారం 15 వేల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో ఎస్.అన్నపూర్ణ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.మరికొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు.విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ ఎస్పీ అన్నపూర్ణ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు, కొమురవెల్లి ఎస్సై రాజు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నడిపించాలని వినతి

వర్గల్, మే 25: విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరుతూ ఆదివారం మండలంలోని నెంటూర్ గ్రామానికి చెందిన యువత గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు వేల జనాభా కలిగిన గ్రామానికి పదేండ్లుగా బస్సుసౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. నెంటూర్‌తో పాటు గోవిందాపూర్, గిర్మాపూర్, మాలపల్లి, రాంసాగర్‌పల్లి, జెబ్బాపూర్, మైలారం గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక నిత్యం ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. గజ్వేల్-హైదరాబాద్, తూప్రాన్ పట్టణాలకు నిత్యం నెంటూర్ మీదుగానే వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం సభ్యులు ప్రదీప్‌గౌడ్, పాండు, వెంకట్, మధు, భాను, బన్నీ, కృష్ణ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు

హుస్నాబాద్‌టౌన్, మే 25: 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు హుస్నాబాద్‌లోని కేడీసీఎంఎస్‌లో అందుబాటులో ఉన్నాయని ఏఈవో శివరామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 40కిలోల బ్యాగును రూ. 2510కి ఇస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌పత్రాలతో సంప్రదించాలని ఆయన సూచించారు.

అధిక దిగుబడి వచ్చే విత్తనాలు ఎంచుకోవాలి

గజ్వేల్, మే 25: అధిక దిగుబడి వచ్చే పత్తి విత్తనాలు ఎంచుకోవాలని అంకుర్ సీడ్స్ రీజినల్ మేనేజర్ హరివర్మ తెలిపారు. మండలంలోని దిలాల్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు గజ్వేల్, జగదేవ్‌పూర్, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన రైతుల అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అన్ని నెలలకు అనువైన విత్తనాలు ఎంపికచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీకాంత్, డిస్ట్రిబ్యూటర్ గొలి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

30న కబడ్డీ పోటీలు

గజ్వేల్, మే 25: లోకమాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి సందర్భంగా ఈనెల 30న గజ్వేల్‌లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సామాజిక సమరత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో పాల్గొనే వారు ఈనెల 29లోగా సెల్: 8885728286, 8919679704 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రతి టీంకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మద్దూరు(ధూళిమిట్ట), మే 25: ధూళిమిట్ట మండలంలోని జాలపల్లివాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన చెట్కూరి సచిన్ (టీఎస్ 36 డీ1146 నంబర్ గల ట్రాక్టర్) అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమంగా ఇసుక రవాణా చేయరాదని, ఒక వేళ ఇండ్లు మంజూరైతే తహసీల్ కార్యాలయంలో ఇసుక కోసం దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామన్నారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని, కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేత

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బొంగు రాంరెడ్డి

కొమురవెల్లి, మే 25: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కొమ్ముల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి తండ్రి బొంగు రాంరెడ్డి ఫౌండేషన్ తరపున రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.

ఎలక్ట్రానిక్ తూకంలో తేడా

వ్యత్యాసాన్ని చూపుతున్న ఎలక్ట్రానిక్ యంత్రం

కొమురవెల్లి, మే 25: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు అడుగడుగునా మోసపోతున్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండలంలోని మర్రిముచ్చాలలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో ఎలక్ట్రానిక్ కాంటాలో 20కిలోలకు 19కిలోల 500 గ్రాములు మాత్రమే చూపుతున్నది. దీని ప్రకారం క్వింటాల్‌కు రెండున్నర కిలోలు అదనంగా రైతుల నుంచి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు సేకరిస్తున్నారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

###